క్లుప్తంగా

పుస్తక పఠనం చేయించాలి

కెరమెరి: విద్యార్థులతో ప్రతీరోజు పుస్తక పఠనం చేయించాలని కెరమెరి కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. రికార్డులతో పాటు విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలు చదివించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామంలో ఎల్కపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహణ సదస్సు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. బ్యాంకులోని సేవలు పొదుపు, ఇన్సురెన్సులను ఆయన వివరించారు. డిజిటల్ లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. ఖాతాలకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు కళాజాత ఆధ్వర్యంలో పాట రూపంలో పథకాలను తెలియజేశారు.

పెద్దల సమక్షంలో ఒకటైన ప్రేమజంట

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పెద్దల సమక్షంలో ప్రేమజంట ఒక్కటైంది. పోతేపల్లి గ్రామానికి చెందిన చంద్రగిరి సంతోష్, కాగజ్‌నగర్‌కు చెందిన గడ్డం సాయిదేవి గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. అమ్మాయి కుటుంబీకులు పెండ్లికి నిరాకరించడంతో పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిపారు. పెద్దలు, ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగేడిపెల్లి మహేశ్, పులూరి సతీశ్ కుమార్, సంజీవ్, నిలేశ్, రామదాసు, బండ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం

రెబ్బెన: మండలంలోని నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పురుషోత్తం మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బాలికలకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నంబాలతో పాటు మండలంలోని గంగాపూర్, తక్కళ్లపల్లి, నవేగాం పాఠశాలల్లో సైతం కరాటే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు.

పంటల సాగుపై అవగాహన

లింగాపూర్: మండల కేంద్రంలోని పంటల వివరాల నమోదు ప్రక్రియను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు కంచన్‌పల్లి గ్రామంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతు పంటల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులు అవలంభించాలని సూచించారు. ఏఈవో ఖలీల్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల పదోన్నతుల కోసం కౌన్సెలింగ్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో పదోన్నతులు, హోదా కలిగిన ఉద్యోగాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్వోటూజీఎం రాజమల్లు మాట్లాడుతూ సింగరేణి ఉన్నత హోదాలు కలిగిన ఉద్యోగాలు, పదోన్నతుల కాలపరిమితి తదితర సమాచారంపై వివరించారు. ఆసక్తి గల ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహేరా, సీనియర్ మెడికల్ అధికారి మురళీ, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదు'

ఆసిఫాబాద్‌రూరల్: జీపీఎఫ్ నిధుల మంజూరు విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందూరావు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జెడ్పీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌కు వినతపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్ నుంచి రుణం ఇవ్వడం లేదని ఆరోపించారు. కొంతమంది అధికారులకు మంజూరు చేసి మరికొందరికి ఇవ్వకపోవడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, ఉపాధ్యక్షుడు హేమంత్, నాయకులు ఊషన్న, రమేశ్, హరీశ్, గణేష్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

బెజ్జూర్: విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని మండల కేంద్రానికి చెందిన మెడికల్ వ్యాపారి తునికి సురేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జ్యోతి బాపూలే ప్రైవేట్ విద్యాలయంలో విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు.

అలరిస్తున్న గుస్సాడీ వేడుకలు

కెరమెరి/ఆసిఫాబాద్‌అర్బన్: గిరిజన ఆదివాసీ పల్లెల్లో దండారీ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. డప్పుళ్ల చప్పుళ్లు.. కాళ్లకు గజ్జెలు.. చేతిలో దుడ్డు.. చంకలో జింకచర్మం వేసుకుని సంప్రదాయ నృత్యం చేస్తూ ఆదివాసీలు సంబరాలు చేసుకుంటున్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కెరమెరి మండలంలోని వివిధ గ్రామాల్లో గుస్సాడీ నృత్యాలు కనులవిందు చేస్తున్నాయి. మంగళవారం హట్టి గ్రామంలో దండారీ కార్యక్రమం కొనసాగింది. హట్టి గ్రామానికి చెందిన దండారీ కొరారి గ్రామం నుంచి వచ్చిన వారికి ఆతిథ్యమిచ్చారు. మహిళలు, పురుషులు దండారీకి, గుస్సాడీలకు సంప్రదాయ భేటింగ్ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంకమరాజు ఆలయ ఆవరణలో దండారీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ దండారీ ఉత్సవాలతో గ్రామాల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు.


సంప్రదాయ వాయిద్యాలతో ఆదివాసీలు


హారతులు స్వీకరిస్తున్న దండారీ


కోలా ఆడుతున్న యువకులు


దండారీలతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి


నృత్యం చేస్తున్న గుస్సాడీలు

'సమగ్ర' సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, భారీ పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో పాటు హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, తెగలు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతికి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాల్లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి శిక్షణ ఇవ్వాలన్నారు. నవంబర్ 1 నుంచి 3 వరకు ఇళ్ల సంబంధిత సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని, 3 నుంచి 5 వరకు గుర్తించిన ఇళ్లకు స్టిక్కర్లు అంటించాలని, 6 నుంచి 18 వరకు పూర్తి సమాచారాన్ని సేకరించాలని, 19 నుంచి 27 వరకు సేకరించిన వివరాలను నిర్ణీత నమూనాలో నమోదు చేయాలన్నారు. 27 నుంచి 29 వరకు వివరాలను పునఃపరిశీలించి 30న నివేదిక సమర్పించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే ప్రక్రియలో ప్రతి ఎన్యుమరేటర్‌కు 150 నివాస గృహాలు కేటాయించనున్నట్లు తెలిపారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

- ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్: పదోన్నతితో పోలీసు అధికారులకు మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. జిల్లాలో హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన ఎండీ జాఫర్ సాదిక్, రాజ్‌కుమార్‌లను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఐ పెద్దన్న, ఆర్ఐ ఎంటివో అంజన్న పాల్గొన్నారు.


పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న ఎస్పీ

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం ఎస్సై కొమురయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేశారు. మాజీ సర్పంచ్ చంద్రమౌళి, తిరుపతి, మహేశ్, ప్రభాకర్, భాస్కర్, భీమయ్య, చిన్నయ్య, దేవాజీ, సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత..

బొంబాయిగూడ గ్రామానికి చెందిన బడిబయటి విద్యార్థి రౌతు సిద్ధుకు ఎస్సై స్కూల్ బ్యాగుతో పాటు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఆయన వెంట సామాజిక కార్యకర్త ప్రకాశ్, ఉపాధ్యాయులు ఉన్నారు.


టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎస్సై కొమురయ్య

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వినతి

బెజ్జూర్: ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మండల కేంద్రానికి చెందిన యువకులు కోరారు. మంగళవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజినల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ పంచాయతీకి కేటాయించిన బస్టాండ్, వార సంత స్థలాలను కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని, ఆ భూమిని కాపాడాలని పేర్కొన్నారు. గతంలో సైతం బెజ్జూరు గ్రామపంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, వార సంత భూమి సర్వే నిర్వహించి హద్దులు సైతం ఏర్పాటు చేయాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

'కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం పోరాడుతాం'

రెబ్బెన: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉండి వారి హక్కుల సాధన కోసం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామని సంఘం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ అనుబంధ తెలంగాణ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాన్ని ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా అంబాల ఓదెలును ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. నాయకులు నిత్యం కాంట్రాక్టు కార్మికులకు అందుబాటులో ఉండాలన్నారు. చంద్రశేఖర్, వెంకటేశ్, సంపత్, కిరణ్, సమ్మయ్య, ఫిట్ కార్యదర్శులు రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి మహర్షి జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: ధన్వంతరి మహర్షి జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ భవనంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ ధన్వంతరిని హిందూ పురాణాలలో దేవతల వైద్యుడుగా, ప్రాచీన భారతంలో వైద్యశాస్త్ర పితామహుడిగా పరిగణిస్తారన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సిద్దేశ్వర్, నాయకులు సుభాష్, ఉమేందర్, గంగయ్య, అరవింద్, మారుతిపటేల్, బలరాం, శంకర్, దీపక్, సందీప్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నివారణపై అవగాహన

సిర్పూర్(టి): యువతీ, యువకులు మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిర్పూర్(టి) ఉపాధ్యాయుడు జావిద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నాగేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోలేటి ఆశ్రమంలో సామూహిక ధ్యానం

రెబ్బెన: మండలంలోని గోలేటిలో గల ఆశ్రమంలో మంగళవారం సాయంత్రం సామూహిక ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోలేటి ఆశ్రమ వ్యవస్థాపకులు, రిటైర్డ్ సింగరేణి అధికారి రమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అభ్యాసకులు శ్రీనివాసరావు, వీరస్వామి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


మాట్లాడుతున్న జీసీడీవో శకుంతల

బెజ్జూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆసిఫాబాద్ జీసీడీవో శకుంతల అన్నారు. మంగళవారం మండలంలోని సలుగుపెల్లి, బెజ్జూర్, కుంటలమానెపల్లి ఆశ్రమ పాఠశాలల్లో మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయడంతో పాటు మెనూ పాటించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులతో పాటు విద్యార్థుల హాజరు పట్టిని పరిశీలించారు. కాగజ్‌నగర్ ఏటీడీవో ఖమర్ హుస్సేన్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పరిహారం అందరికీ మంజూరు చేయాలి


ఏఈవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దహెగాం: వర్షాకాలంలో ప్రాణహిత, పెద్దవాగులు ఉప్పొంగి వేల ఎకరాల్లో పంటలు నష్టపోగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతులకు పంట పరిహారం మంజూరు చేయలేదని రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని మొట్లగూడ, రాంపూర్, దిగిడ, రావులపల్లి, గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదిక వద్ద ఆందోళన చేశారు. రైతులకు పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈమేరకు ఏఈవో దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కుమురంభీం ఆశయాలు నెరవేర్చాలి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం ఆశయాలను నెరవేర్చాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని మోవాడ్ గ్రామంలో కుమురం భీం వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సక్కుతో కలిసి కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో పోరాటం చేసిన వీరుడు కుమురం భీం అన్నారు. అనంతరం మోవాడ్ పాఠశాలను సందర్శించారు. సంబంధిత ఈఈకి ఫోన్ చేసి విద్యార్థులకు అదనంగా తరగతి గదులు మంజూరు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, మండల అధ్యక్షుడు రవీందర్, గ్రామస్తులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి

తిర్యాణి: కుమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భీం 84వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీలు ఆత్రం చంద్రశేఖర్, వెడ్మ కమల, వర్ధంతి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కుర్సెంగ బాదిరావు, ప్రధాన కార్యదర్శి మడావి శ్రీరామ్, నాయకులు మడావి గుణవంత్‌రావు, కుర్సెంగ మోతీరాం, వెడ్మ భగవంత్‌రావు, గోపాల్, పెందూర్ ధర్ము, తోడం భాస్కర్, ఆత్రం సంతోష్, గెడం సుభాశ్, కుర్సెంగ శోభన్, దశరథ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో రాణించాలని హెచ్ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో జిల్లాస్థాయిలో కౌటాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. పాఠశాలకు చెందిన శ్రీకాంత్ రన్నింగ్‌లో, ప్రశాంత్ షాట్‌పుట్‌లో, బన్నీత్ కబడ్డీలో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. వారు త్వరలో ఆదిలాబాద్‌లో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, శ్యాంరావు, రయీస్ అహ్మద్, శివాజీ, పీటీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ఆచరణీయం

ఆసిఫాబాద్‌అర్బన్: బుద్ధుడి బోధనలతో ఆచరణీయమని జైభీం సేనా అధ్యక్షుడు వినోద్ జాడె అన్నారు. ధమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమి వద్ద ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మహనీయుడికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మార్కెట్‌లో దీపావళి సందడి!


లింగాపూర్: టపాసులు కొంటున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్/ లింగాపూర్: జిల్లా కేంద్రంతో పాటు లింగాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్‌లో మంగళవారం దీపావళి సందడి నెలకొంది. ఆయా మార్కెట్‌లలో ప్రజలు మట్టితో తయారు చేసిన ప్రమిదలు, రంగురంగుల కలర్లు, విద్యుత్ దీపాలు కొనుగోలు చేశారు. దీపావళి పండుగ ఒకటే రోజు ఉండటంతో మార్కెట్‌లు, కిరాణాల్లో ప్రజలు బారులుదీరారు.


ఆసిఫాబాద్‌రూరల్: రంగులు కొనుగోలు చేస్తున్న మహిళ


ఆసిఫాబాద్‌రూరల్: మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై, ప్రిన్సిపాల్

కెరమెరి: యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని ఎస్సై గంపుల విజయ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నవీన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. చెడు అలవాట్లకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. అధ్యాపకులు శ్రీనివాస్, స్వామి, కిశోర్, రాము, సునీల్, సరళ ఉన్నారు.